**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-9, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**ప్రచురణార్థం/ప్రసారార్థం :** **విజయవాడ,**
**తేది : 06 ఏప్రిల్, 2023.**

ఈనెల 3,4 తేదీలలో విజయవాడలో సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ సమావేశాలు జరిగిన సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మీడియాకు వివరించారు. వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాలకు పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, యం.ఏ.బేబి.లు హాజరయ్యారు.

మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన అన్యాయం, వివక్షపూరిత విధానాలు, ద్రోహానికి వ్యతిరేకంగా పోరాడాలని, మతోన్మాదాన్ని నిలువరించాలని, దీనికి వ్యతిరేకంగా అన్ని పార్టీలు ముందుకు రావాలని పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం పిలుపునిచ్చింది.

గత ఐదారు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం మీద ప్రజల్లో వ్యతిరేకత మరింత పెరుగుతున్నది. ఇది మొన్న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో వ్యక్తమైంది. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పోలవరం, విశాఖ ఉక్కు వంటి విషయాలలో కేంద్రంతో పోరాడకుండా లాలూచీ పడుతున్నది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఇంత చేస్తున్నా టిడిపి, జనసేన పార్టీలు బిజెపితో అవకాశవాద పొత్తులకోసం అర్రులు చాస్తున్నాయి. జనసేన పార్టీ బిజెపి ఢిల్లీ పెద్దలతో ఇటీవల జరిపిన మంతనాలు రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమైనవి, దెబ్బతీసేవి. బిజెపి రాష్ట్రాన్ని అధోగతిపాల్జేస్తుంటే, ప్రజలందరూ తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తం చేసి, ఛీ కొడుతుంటే జనసేన మాత్రం బిజెపిని వాటేసుకొని రాజకీయ పొత్తుపెట్టుకోవడమేగాదు, తెలుగుదేశాన్ని కూడా తీసుకువస్తానని, ముగ్గురం కలిసి పొత్తు పెట్టుకుంటామని చెప్పడమంటే రాష్ట్ర ప్రయోజనాలను బలిపెట్టడమే. ఇప్పటికైనా వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బిజెపి పట్ల తమ వైఖరి పునరాలోచించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నది. బిజెపి కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రయోజనాలకోసం పోరాటం చేయాలి కానీ రాజీ పడడం ద్వారా కాదు. బిజెపిని కలుపుకుని పోవడం వైసిపికి ఉపయోగపడే చర్య అవుతుంది. రాష్ట్రానికి అన్ని రకాలుగా ద్రోహం చేసిన బిజెపితో ఎలా కలుస్తారో జనసేన ప్రజలకు వివరణ ఇవ్వాలి.

రాష్ట్రంలో తమ రాజకీయ ప్రయోజనాలకోసం బిజెపి వివిధ సందర్భాల్లో మత ఉద్రిక్తతలను రెచ్చగొడుతున్నది. మతం ప్రజలకున్న వ్యక్తిగత స్వేచ్ఛ. కానీ ఆర్‌ఎస్‌ఎస్ బిజెపిలు శ్రీరామనవమి సందర్భంగా శోభాయాత్రలు, వివిధ కార్యక్రమాల పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు, ఘర్షణలు పెంచుతున్నది. ప్రజల్లో అభద్రతాభావం సృష్టించే బిజెపి యత్నాలను తిప్పికొట్టాలని ప్రజలకు, పార్టీలకు, లౌకికవాదులకు విజ్ఞప్తి చేస్తున్నది.

కానీ దురదృష్టవశాత్తు కొన్ని పార్టీలు మోడీకి కొమ్ముకాస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మోడీ విధానాలను అందరికంటే ముందుగా అమలు చేస్తున్నది. విద్యుత్ ఛార్జీలు, చెత్తపన్ను, ఆస్థిపన్ను పెంచారు. విద్యా విధానం, పారిశ్రామిక విధానాలను అస్తవ్యస్తం చేశారు. అదానీ లాంటి వారి కొమ్ముకాచి రాష్ట్ర సంపదను వారికి అప్పగిస్తున్నది. వారికి రాయితీలిచ్చి ప్రజలపై భారాలను, రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులను ప్రజలపై నెట్టాలనిచూస్తున్నది. వ్యవసాయరంగంలో మీటర్లు పెట్టి మెడమీద కత్తివేలాడేలా చేసింది. బిజెపి రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వలేదు. విభజన హామీలు అమలుజరపలేదు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆగలేదు. దాని ఉత్పత్తిని దెబ్బతీసి, ముడి సరుకు ఇవ్వకుండా, జిందాల్ కంపెనీల ప్రతినిధులను తీసుకువచ్చి వారిద్వారా ముడిసరుకు సప్లై చేయించి దొడ్డిదారిన ప్రయివేటీకరణ యత్నాలను చేస్తున్నది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, ఇతర రాజకీయ

పక్షాలుమాట్లాడడం లేదు. అన్ని పార్టీలు ముందుకొస్తే తప్ప విశాఖ ఉక్కును కాపాడుకోలేం. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరానికి నిధులివ్వలేదు. అక్కడ మునిగిపోతున్న నిర్వాసితులకు సహాయం చేయలేదు. కేంద్ర ప్రభుత్వం నుండి ఇన్ని వైఫల్యాలు కనిపించినా సరే మన రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలు బిజెపి కేంద్ర ప్రభుత్వానికి కొమ్ముకాస్తున్నాయి.

అంగన్‌వాడీల ఆందోళన జరగకుండా ఎక్కడికక్కడ అరెస్టులు, నోటీసులు, బెదిరింపులు చేసినా లెక్క చేయకుండా ఏడెనిమిది వేల మంది విజయవాడ చేరుకున్నారు. చేరుకున్న మూడు నాలుగు వేల మందిని అరెస్టు చేశారు. ఆశాలు, కాంట్రాక్టు వర్కర్స్ ఆందోళన చేస్తుంటే పిలిచి, చర్చించి సమస్యలు పరిష్కరించడానికి బదులుగా నిర్బంధం ద్వారా అణచివేయాలని చూడడం సహించరాని విషయం.

రాష్ట్ర ప్రజలు ధరలు పెరిగి నానాబాధలు పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ళ నుండి నవరత్నాలు గురించి చెప్పిందే చెబుతున్నది తప్ప రాష్ట్రాభివృద్ధి గురించి గానీ, ఉపాధి గురించిగానీ, నిరుద్యోగం గురించి గానీ మాట్లాడడం లేదు. పరిశ్రమలు రాలేదు. కానీ గ్లోబల్ సమ్మిట్‌పేరుతో రాష్ట్ర ప్రభుత్వం హడావుడి చేసింది. పాత ఒప్పందాలనే మరలా చెప్పి నిరుద్యోగుల్లో భ్రమలు కల్పించడం తప్ప మరేమీ కాదు. విశాఖపట్నంలో జి20 పేరుతో హడావుడి చేసినా ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో బొక్కబోర్లా పడింది. ముఖ్యమంత్రి నివాసం మార్పు, రాజధాని మార్పు అంటూ కబుర్లు చెప్పినా ఉత్తరాంధ్ర ప్రజలు వీరి బుట్టలో పడలేదు. ఓటమి తరువాతనైనా వైసిపి ప్రభుత్వం దారిమార్చుకొని ప్రజలు అభిప్రాయాలకనుగుణంగా నడుచుకుంటే మంచిది.

రాబోయే రోజుల్లో బిజెపి కార్పొరేట్ అనుకూల మతోన్మాద విధానాలపై పోరాడుతూనే రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సిపిఐ(యం) పిలుపునిచ్చింది. ప్రజలపై వేసే భారాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే అనేక సమస్యలపై పోరాటాలు చేస్తున్న కార్మిక సంఘాలు, యువజన, మహిళా, రైతు, వ్యవసాయ కార్మిక ఉద్యమాలకు, భూపోరాటాలకు మద్దతు ప్రకటించింది.

కేంద్ర బిజెపి ప్రభుత్వ దుర్మార్గ విధానాలపై సిపిఐ(యం), సిపిఐ ఉమ్మడి ప్రచార భేరి నిర్వహిస్తాయి. బిజెపి ద్రోహానికి రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు ప్రజలను సంఘటితం చేయాలని నిర్ణయించింది. ఏప్రిల్ 14న విజయవాడలో ఈ ప్రచార భేరి ప్రారంభించాలని, దీనికి కేంద్ర నాయకులు ప్రకాష్‌కరత్, వినయ్‌విశ్వం హాజరవుతారని. ఏప్రిల్ 30 వరకు ఈ క్యాంపెయిన్ రాష్ట్రమంతా నిర్వహించాలని నిర్ణయించింది.

(జె.జయరాం)
ఆఫీసు కార్యదర్శి